అపుడే నీటి ఎద్దడి..

జోరందుకున్న ట్యాంకర్ల బుకింగ్



హఫీజ్‌పేట్ పరిధిలో జలమండలి సెక్షన్ వద్ద ట్యాంకర్లను సిద్ధం చేస్తున్న దృశ్యం

- మాదాపూర్ ఏరియాలో రోజూ 700 ట్యాంకర్లు బుకింగ్
- కొన్ని సెక్షన్లలో వారానికొకసారి..
- ఇదీ శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిస్థితి

గచ్చిబౌలి/హఫీజ్‌పేట్: వేసవి ఆరంభం నుంచి జూన్ వరకు మంచినీటి సమస్య గట్టెక్కేనా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. శేరిలింగంపల్లి జలమండలి డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. అయితే అధికారులు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసి పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన మేరకు పైనుంచి నీటి సరఫరా ఉండడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.రోజువిడిచి రోజు మంచినీటి సరఫరా కొనసాగిస్తున్నారు. కాగా కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది.

జంట సర్కిళ్ల పరిధిలో నీటి సరఫరా వివరాలు..

- జలమండలి శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో గ్రౌండ్‌లెవల్ రిజర్వాయర్లు 18 ఉన్నాయి.
- 7 ఓవర్ హెడ్ ట్యాంకులు పనిచేస్తున్నాయి.
- శేరిలింగంపల్లి జలమండలి పరిధిలో డివిజన్‌కు రోజుకు 45 ఎంజీడీల నీరు అవసరం
- రోజు విడిచి రోజు 45 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నారు.
- ట్యాంకులను నింపి ఆ తర్వాత పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికి సరఫరా చేస్తున్నారు.
- నిత్యం జలమండలి డివిజన్ పరిధిలో 120 ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు.
- ఒక్కో ట్యాంకర్ రోజుకు 10 ట్రిప్పుల నీటిని సరఫరా చేస్తోంది.
- మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి సెక్షన్ల పరిధిలో జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది.
- చందానగర్, నల్లగండ్ల, ఆర్‌సీపురం ఏరియాల నుంచి బుకింగ్‌లు తక్కువ.
- కొన్నిచోట్ల వారానికో రోజు, ఇంకొన్ని చోట్ల ఒకటి రెండు రోజుల్లో సరఫరా చేసేందుకు డిమాండ్‌ను బట్టి ఏర్పాట్లు చేస్తున్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు సరఫరా, సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎక్కడా నీటి సమస్య రాకుండా చూడాలని ఉన్నతాధికారుల ఆదేశాలు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో రోజుకు 45 ఎంజీడీలు అవసరం కాగా అవసరమైన మేరకు కాకుండా కొన్ని సందర్భాలలో అంతకన్నా ఎక్కువగానే వస్తోంది.

– రాజశేఖర్, జీఎం జలమండలి, హఫీజ్‌పేట్ డివిజన్

కొన్నిచోట్ల నీటి సమస్య..

- జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసిన ప్రాంతాల్లో నీటి సమస్య వస్తోంది.

అక్రమంగా బోర్లే..బోర్లు

మాదాపూర్: మాదాపూర్ ఏరియాలో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడ ఎక్కువగా వ్యాపార సముదాయాలు ఉన్నాయి.

- హాస్టళ్లు ఎక్కువగా ఉండడంతో నీటి వినియోగం కూడా ఎక్కువ. ఐటీ ప్రాంతం కావడంతో నీటి కొరత ఏర్పడుతోంది.
- మాదాపూర్‌లో మూడు ఫిల్లింగ్ స్టేషన్‌లు ఉన్నాయి. ప్రతి రోజు మూడు స్టేషన్‌లలో దాదాపు 650 నుంచి 700 వరకు ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి.
- బుక్ అయిన వాటిలో అదే రోజు 600 వరకు సప్లై చేస్తున్నట్లు మాదాపూర్ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి మేనేజర్ తెలిపారు.
- మాదాపూర్‌లో జనాభా పెరుగుతుండడంతో నీటి సమస్యను తగ్గించడానికి మరో ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు.
- మాదాపూర్ పరిసర ప్రాంతాలలో అక్రమ బోర్లను అధికారులు అడ్డుకోకపోవడంతో ఒక్కో ట్యాంకర్‌కు రూ. 800 నుంచి 3000 వరకు వసూలు చేస్తున్నారు.


మాదాపూర్ హైటెక్స్ వద్ద అక్రమ నీటి బోరు


మాదాపూర్‌లోని అక్రమ నీటి బోర్ల వద్ద ట్యాంకర్‌లను నింపుతున్న దృశ్యం

- భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకోని కాలనీలు, బస్తీలలో కూడా సమస్య తలెత్తుతోంది
- కొన్ని అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీలలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవడంతో ఆయా ప్రాంతాలలో నీటి సమస్య లేదు
- మాదాపూర్, అయ్యప్పసొసైటీ, కొండాపూర్, హఫీజ్‌పేట్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలలో బోర్లు ఎండిపోతున్నాయి. ఆయా చోట్ల ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంటోంది.
- కొన్ని కాలనీలు, బస్తీలలో 1600 అడుగులు బోరు వేసినా నీరు పడడం లేదు. దీంతో ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో పిక్సెల్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు వైద్య పరీక్షలు చేసుకోవటం వల్ల వ్యాధి నిర్ధారణ జరుగుతుందని, తద్వారా సకాలంలో చికిత్స పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అబ్దుల్ రషీద్, కృష్ణ, పూజిత, షబ్బీర్, కిందికుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

27న నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ఈ నెల 27న నిధి ఆప్‌కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ శ్రీ విశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో ఈ శిబిరాలను ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.రంగారెడ్డి జిల్లా కొండాపూర్ జయభేరి వర్క్ షాప్, సంగారెడ్డి జిల్లా.. కంది మండలం ది అక్షయపాత్ర ఫౌండేషన్, సంగారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్, భవిష్యనిధి సమస్యలు ఉన్న వారు పైన పేర్కొన్న 3 కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

గీతం స్కాలర్ రేఖకు పీహెచ్‌డీ

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్సెస్ గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని రేఖకు డాక్టరేట్ ప్రకటించారు. 'అనిశ్చిత పరిమితులతో కూడిన బలమైన విరామం- విలువ గల ఆప్టిమైజేషన్ సమస్యలకు కొంత సహకారం' అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), బిగ్ డేటా,కృత్రిమ మేధ వంటి సాంకేతికతల వినియోగంతో, విస్తారమైన, విభిన్నమైన డేటా విశ్లేషణ కీలకంగా మారిందన్నారు. రేఖ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీకొ అర్హత సాధించడం పట్ల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం , అదనపు ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

అతిపెద్ద డిజిటల్ ఎకానమీ భారతదేశానిది


హిల్‌రిడ్జ్ విల్లాస్‌వాసులతో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఎకానమీ భారతదేశానిదని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హిల్‌రిడ్జ్ విల్లాస్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ ఎకానమీ అంటే సాధారణ ప్రజానీకానికి ఏం తెలుస్తుందని హేళన చేశారన్నారు. నేడు పట్టణ ప్రాంతాలలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలోనూ డిజిటల్ ఎకానమీ యూజ్ చేస్తున్నారన్నారు. ఏదైనా పని మొదలు పెట్టేటప్పుడు సంకల్పం ముఖ్యమన్నారు. ఆ సంకల్ప బలం ప్రధానమంత్రి నరేంద్రమోడీలో పుష్కలంగా ఉందన్నారు. అదే నేడు దేశాన్ని ముందుకు నడిపిస్తోందన్నారు. కొవిడ్ మహమ్మారి ఆర్థిక సంక్షోభంతో ప్రపంచం విలవిల్లాడిపోయిందన్నారు, అయినా భారతదేశం స్థిరంగా ఉందన్నారు. అది మోడీ నాయకత్వానికి నిదర్శనమన్నారు. కోట్ల మంది భారతీయుల రామమందిరం కల మోడీ హయాంలో సాకారమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విల్లా వాసులు పాల్గొన్నారు.

నేడు హెచ్‌సీయూలో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ అండ్ ఎస్ఎంఎస్ సిల్వర్ జూబ్లీ విశిష్ట ఉపన్యాస శ్రేణిలో భాగంగా ప్రత్యేక లెక్చర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మంగళవారం ఉదయం 11 గంటలకు హెచ్‌సీయూలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ లెక్చర్‌హాల్ కాంప్లెక్స్‌లో 'స్ట్రాంగ్ ఎట్ సస్టేనబుల్: ఇండియాస్ మార్చ్ టు ది థర్డ్ లార్జెస్ట్ ఎకానమీ' అనే అంశంపై సైయింట్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు.

ఎస్ఎం ఫసియుల్లాకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి ఎస్ఎం ఫసియుల్లాకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆయన ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ విభాగంలో పరిశోధక విద్యార్థి. ప్రొఫెసర్ సయ్యద్ మహ్మద్ హసీబుద్దీన్ ఖ్వాద్రీ పర్యవేక్షణ, సహ పర్యవేక్షకులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవిందయ్య గొడవర్తి ఆధ్వర్యంలో 'మ్యాపింగ్ హైదరాబాద్ ఇన్ ఫిక్షన్-ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ నావెల్స్' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్ సమర్పించారు.

'థెరానోస్టిక్ అప్లికేషన్స్' పుస్తకావిష్కరణ

రాయదుర్గం: హెచ్‌సీయూ, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలోని ఇద్దరు ఫ్యాకల్టీ ప్రతినిధులు ఎడిట్ చేసిన పుస్తకాన్ని స్ప్రింగర్ సింగపూర్ సంస్థ ప్రచురించింది. ఈ పుస్తకాన్ని హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ న్యూరల్ అండ్ కాగ్నిటివ్ సైన్సెస్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన డాక్టర్ ఆకాష్‌గౌతమ్, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలోని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ విశాల్ చౌదరి ఎడిట్ చేశారు. న్యూరోలాజికల్ డిజార్డర్స్‌లో నానో టెక్నాలజీకి సంబంధించిన 'థెరానోస్టిక్ అప్లికేషన్స్' పేరుతో ఈ పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకం నరాల సంబంధిత రుగ్మతల చికిత్స, నిర్ధారణకు నానో టెక్నాలజీ అప్లికేషన్‌లను వివరిస్తుంది.

బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి

రాయదుర్గం: గోపన్‌పల్లితండాలో కొనసాగుతున్న బెల్ట్ షాప్‌పై సోమవారం మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. హానర్ హోమ్స్ అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న ఒక వాటర్‌ప్లాంట్ వద్ద హరిప్రసాద్ అనే వ్యక్తి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడని ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో సోమవారం ఉదయం ఆ దుకాణంపై దాడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. దుకాణంలో రూ.8వేల విలువ చేసే 26 మద్యం సీసాలతోపాటు రూ.2,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్

హఫీజ్‌పేట్: డివిజన్ పరిధిలోని హుడా కాలనీలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి లలితా నగరేశ్వర దేవాలయం వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్‌హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శేరిలింగంపల్లి నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రవికుమార్, సురేష్ గౌడ్, ప్రవీణ్ కుమార్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ గుప్త, హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొండా విజయ్, కోటేశ్వరరావు, కృష్ణ, శ్రీను, రాజు, కాలనీ వాసులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


మంజీరా రోడ్డులో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డులో చేపట్టిన నూతన పైప్‌లైన్ పనులతో లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు.హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డులో జరుగుతున్న పనులను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహెచ్ఈఎల్ నుంచి కల్వరి టెంపుల్ వద్ద ఉన్న రిజర్వాయర్ వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర రూ.40 కోట్లతో నూతన మంజీరా పైప్‌లైన్ పనులు చేపట్టడం జరిగిందన్నారు.1960 సంవత్సరంలో వేసిన మంజీరా పైప్‌లైన్ లీకేజీ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లీకేజీలకు ఇక చెల్లు అని ,పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

హెచ్‌సీయూను సందర్శించిన మైసూర్ బృందం


మాట్లాడుతున్న దార్ల వెంకటేశ్వరరావు, చిత్రంలో సీఐఐఎల్ బృందం

రాయదుర్గం: మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థలో శిక్షణ పొందుతున్న పరిశోధకులు, అధ్యాపకులు సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగుశాఖను సందర్శించారు. అంతరిస్తున్న భాషలు, మాతృభాషల అధ్యయన సంస్థ(సీఈఎల్ అండ్ ఎంటీఎస్)ను కూడా వారు సందర్శించారు. ఆరుగురు సభ్యులతో కూడిన ఈ బృందానికి డాక్టర్ మిరియాల సత్యనారాయణ నాయకత్వం వహించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, సీఈఎల్ అండ్ ఎంటీఎస్ శాఖ అధ్యక్షుడు పమ్మి పవన్‌కుమార్, తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్యులు గోనానాయక్, వారిజారాణి, వంగరి త్రివేణి, భుజంగరెడ్డి, విజయ్‌కుమార్, భాశెట్టిలత తదితరులను ఈ బృందం కలిసింది. ఈ బృందంలో ప్రేమ, సంతోష్, కవిత, దక్షిణామూర్తి, సి బసవరాజు, కుముద ఉన్నారు.

మహాలక్ష్మీ యాగం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ద్వాదశ వార్షిక శ్రీ మహాలక్ష్మీ యాగంలో భాగంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.12 నదుల తీర్థములు, పంచామృత అభిషేకం, సామ్రాజ్యలక్ష్మీ హోమం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం చక్రస్నానం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


స్వామి వారిని చక్రస్నానానికి తీసుకెళుతున్న అర్చకులు

కాలేయ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి

మాదాపూర్: దక్షిణ భారతదేశంలో రోజురోజుకి కాలేయ వ్యాధులు గణనీయంగా పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని యశోద హస్పిటల్‌లో సోమవారం (లివర్ సమస్యలపై) బ్రిడ్జి ది గ్యాప్స్ లివర్ చాప్టర్ నేషనల్ కాన్ఫరెన్స్ , లైవ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేయ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. వైరల్ హెపటైస్, ఫ్యాటీ లివర్, లివర్ ఫైబ్రోసిస్, లివర్ సిర్రోసిస్, లివర్ క్యాన్సర్‌ల వరకు అనేక రకాల కారణాలను తెలుసుకోవచ్చన్నారు. భారతదేశంలో కాలేయ సంబంధిత మరణాలు సంవత్సరానికి 268.580(మొత్తం మరణాలలో 3.17శాతం)కి చేరుకున్నాయని తెలిపారు. లివర్ సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డా.నవీన్ పోలవరపు, డా.సంతోష్ ఎనగంటి, సోమశేఖర్‌రావు, డా. గోపి శ్రీకాంత్, డా. శరత్‌చంద్ర గోరంట్లలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు పాల్గొన్నారు.


యశోద ఆస్పత్రిలో లైవ్ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి తదితరులు

వాహన తనిఖీలకు ప్రజలు సహకరించాలి

అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా


పాత టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీని పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్: వాహనా తనిఖీలకు వాహనదారులు సహకరించాలని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా అన్నారు. సోమవారం పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలో చెక్‌పోస్టును పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బు రవాణా చేస్తే తప్పనిసరిగా ఆ నగదుకు సంబంధించిన రసీదు ఉండాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ అమరేందర్ రెడ్డి ,పోలీసులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ పరిచయం.. రూ.8 లక్షలు కాజేశారు

పటాన్‌చెరు టౌన్: బీరంగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఫేస్‌బుక్‌లో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. లండన్ నుండి హైదరాబాద్ వస్తున్నాను అని నమ్మించి పలు దఫాలుగా ఉద్యోగి నుండి రూ.8 లక్షల 57 వేలు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫేస్‌బుక్‌లో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. కాగా మహిళ తాను లండన్ నుండి హైదరాబాద్‌కి ప్రాజెక్ట్ పనిపై వస్తున్నానని కొంత నగదు అవసరం అని, హైదరాబాద్‌కు వచ్చాక తిరిగి ఇచ్చేస్తానని అతనిని నమ్మించింది. ఈ క్రమంలో బాధితుడు పలు దఫాలుగా రూ.8 లక్షల 57 వేల నగదును అపరిచిత మహిళకు పంపాడు.హైదరాబాద్‌కు వస్తానని చెప్పిన మహిళ రాకపోగా,మెసేజ్‌లు పంపినా స్పందించకపోవడంతో ప్రైవేట్ ఉద్యోగి తాను మోసపోయినట్లు గుర్తించి, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం సోమవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్ బాలనగర్ కు చెందిన మాలే కాశీనాథ్(37) ప్రైవేటు ఉద్యోగి. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 22వ తేదీ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బయటకు వెళ్లి వస్తానని చెప్పి కాశీనాథ్ పటాన్‌చెరు మండలం నందిగామ మంజీర వెంచర్ సమీపంలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చికిత్స కోసం బీరంగూడ కమాన్ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం మృతుడి భార్య కావ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంజీర లీకేజీ.. మంచినీరు రోడ్డు పాలు..


ఆదర్శనగర్ రోడ్డు 3 ఎంట్రన్స్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శనగర్‌లో ప్రధానరోడ్డులో మంజీర పైప్‌లైన్ లీకేజీతో నీరు రోడ్డు పాలవుతోంది. ఆదర్శనగర్ రోడ్డు నెంబర్ 3 ఎంట్రన్స్‌లోనే మంజీర నీరు నిరంతరం లీక్ అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాగా భూగర్భ జలాలు అడుగంటుతున్నా వాటర్ వర్క్స్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హోలీ సంబరం



రాయదుర్గం/శేరిలింగంపల్లి: హోలీ సంబరాలు హోరెత్తాయి. పలుచోట్ల ప్రజలు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్‌లోఎంబీఏ విద్యార్థుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన వేడుకల్లో 400 మంది విద్యార్థులు, యువత పాల్గొని సందడి చేశారు. లైవ్ బ్యాండ్‌తో విద్యార్థుల నృత్యాలతో క్యాంపస్ హోరెత్తిపోయింది. అలాగే నల్లగండ్లలోని అపర్ణ గ్రాండేలో హోలీ వేడుకలు చేసుకున్నారు.

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణం, గ్రామాల్లో సోమవారం ఉదయం చిన్నారులు, యువత, స్నేహితులతో కలిసి వీధుల్లో తిరుగుతూ రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ సంబరాలు చేసుకున్నారు.


నల్లగండ్లలోని అపర్ణాగ్రాండేలో కమ్యూనిటీవాసులు


గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్‌లో


గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సంబరాల్లో విద్యార్థులు





కంచికి వెళ్లకున్నా కొడకంచికి వెళ్లాల..

జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామంలో గల శ్రీదేవీ, భూదేవీ సమేత ఆదినారాయణస్వామి దేవాలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. కంచికి వెళ్లకున్న కొడకంచికి వెళ్లాలనే నానుడి ఉంది. వేసవి సెలవుల్లో విద్యార్థులు, ఉద్యోగులకు సెలవులు ఉండటంతో ఈ దేవాలయాన్ని సందర్శిస్తుంటారు. ఈ దేవాలయంలో బంగారు, వెండి బల్లులు ఉంటాయి. ఇక్కడ పురాతన నిర్మాణాలు, కొలను ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. వివిధ రకాల సినిమాలు, సీరియల్ షూటింగ్‌లతో పాటు ఫొటో షూట్‌లు ఇక్కడ ఎక్కువగా జరుగుతుంటాయి. – జిన్నారం(పటాన్‌చెరు)

